# సాక్షి అనకాపల్లి

మంగళవారం ¦ 6 ¦ జూన్ ¦ 2023




## ప్రతి అర్జీకి పరిష్కారం

8లో

కలెక్టరేట్ స్పందనలో సోమవారం 220 అర్జీలను స్వీకరించారు. ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.



## సాగరతీరంలో వాక్‌థాన్

విశాఖ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో సాగరతీరంలో వాక్‌థాన్ నిర్వహించారు.



## పోస్టర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్ : ఏయూ విద్యార్థి నరేష్‌కుమార్ చిత్రించిన షార్ట్‌ఫిల్మ్ ఎలర్ట్ పోస్టర్‌ను వీసీ ప్రసాదరెడ్డి సోమవారం ఆవిష్కరించారు.

## న్యూస్‌రీల్

### అమిత్‌షా రాక వాయిదా

- 8కి బదులు 11కి మార్పు
- రైల్వే గ్రౌండ్‌లో బహిరంగ సభ

**సాక్షి, విశాఖపట్నం:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనలో మార్పు చోటు చేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ వివిధ ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా విశాఖ నగరంలో నిర్వహించే బహిరంగ సభకు అమిత్ షా హాజరు కానున్నారు. ముందుగా ఈ నెల 8న అమిత్‌షా సభ విశాఖలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సభను 8కి బదులు 11వ తేదీకి వాయిదా వేశారు. అమిత్ షా సభను నగరంలోని రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆరోజు సాయంత్రం నిర్వహించాలని నిర్ణయించినట్లు బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు.

### చెరకు రైతులకు సబ్సిడీపై యూరియా పంపిణీ



చాకిపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద చెరకు రైతులకు యూరియా పంపిణీ

**చోడవరం:** గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు సబ్సిడీపై ఎరువులను అందజేస్తోంది. చాకిపల్లి రైతుభరోసా కేంద్రంలో సోమవారం ఎరువులను పంపిణీ చేశారు. ఈ ఆర్బీకే పరిధిలో 267మంది రైతులకు 267 బస్తాల యూరియాను సబ్సిడీపై బస్తా రూ.266 వంతున అందజేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ప్రతీ ఏటా చెరకు రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందిస్తారు. దీనిలో భాగంగా ప్రస్తుతం చెరకు మొక్క దశలో ఉండటంతో యూరియా ఎరువును పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పోతల జానకీప్రసాద్, ఫ్యాక్టరీ ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా కృష్ణ, యలమంచిలి వెంకట్రావు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

### 11న మోడల్‌స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష

**అనకాపల్లి టౌన్:** ఏపీ మోడల్‌స్కూల్ 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 11న పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 5 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని, ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందు చేరురుకావాలని తెలిపారు. హాల్‌టికెట్‌ను www.cpms.apcfss.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నామని, విద్యార్థులు తమ ఉపాధ్యాయుల నుంచి తర్ఫీదు పొందవచ్చని పేర్కొన్నారు.
సమాధానాలకు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను మాత్రమే వాడాలని సూచించారు. హాల్ టికెట్‌లో ఫొటో లేకపోతే సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయుడి నుంచి రెండు ఫొటోలు, గెజిటెడ్ అధికారి సంతకంతో తీసుకురావాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలని కోరారు.

### 16 నుంచి యోగా సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూక్యాంపస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఏయూ యోగా కేంద్రం ఈ నెల 16, 17వ తేదీల్లో సదస్సు నిర్వహిస్తోంది. బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ యోగిక్ సైన్సెస్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.తులసీరావు పాల్గొన్నారు.

### చదరంగం పోటీల వాల్‌పోస్టర్ విడుదల

**విశాఖ స్పోర్ట్స్:** అండర్-11 నేషనల్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ వాల్‌పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి సోమవారం విడుదల చేశారు. స్వర్ణభారతి స్టేడియంలో అక్టోబర్ 1నుంచి 9వ తేదీ వరకు చాంపియన్‌షిప్ జరగనుంది. పలు రాష్ట్రాలకు చెందిన అండర్-11 బాలబాలికలు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పోటీలు విజయవంతంగా కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ అదీప్‌రాజ్ పాల్గొన్నారు.



# పొదుపు లెక్క.. మరింత పక్కా

- అందుబాటులోకి 'లోకోస్' యాప్
- రుణాలు చెల్లించకపోవడం, నగదు కాజేత, నకిలీ సంఘాలు వంటి వాటికి చెక్
- పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఒకేచోట
- డీఆర్‌డీఏ సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులకు శిక్షణ



అనకాపల్లిలో లోకోస్ యాప్‌పై సిబ్బందికి శిక్షణ



సమావేశమైన డ్వాక్రా మహిళలు

| జిల్లాలో డ్వాక్రా సంఘాల వివరాలు | |
|---|---|
| గ్రామ సంఘాలు | :1279 |
| మండల సమాఖ్యలు | :24 |
| డ్వాక్రా సంఘాలు | :39,671 |
| సభ్యులు | :4,34,320 |

**అనకాపల్లి రూరల్:** పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. సంఘాల్లోని మహిళలు పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయనున్నారు. గతంలో పొదుపు సంఘాల నిర్వహణను పర్యవేక్షకులు వేర్వేరు యాప్‌ల ద్వారా చేసేవారు. ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన, వ్యాపార లావాదేవీలు, లాభాలు తదితర సమాచార వివరాలు పక్కాగా ఉండేలా పేదరిక నిర్మూలన సంస్థ కొత్తగా లోకోస్ యాప్‌ను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ యాప్‌ను వినియోగించాలని నిర్ణయించడంతో డీఆర్‌డీఏ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా వీవోఏ, ఏపీఎం, సీసీలతోపాటు డ్వాక్రా సంఘాల్లో సభ్యులకు యాప్ వినియోగంపై దశలవారీగా శిక్షణనిస్తున్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల ద్వారా కృషి చేస్తున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంఘాల బలోపేతంతో పాటు సభ్యులు స్వయం ఉపాధిలో రాణిస్తూ నిలదొక్కుకునేందుకు తోడ్పాటునందిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ, బ్యాంకు రుణాలు, పొదుపు వివరాల్లో మరింత పారదర్శకత పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'లోకోస్' అనే కొత్త యాప్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించాయి. ఈనెల 1వ తేదీ నుంచి ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు.

**వేర్వేరు యాప్‌లకు స్వస్తి**

ఇప్పటివరకు పొదుపు సంఘాల వివరాలు వేర్వేరు యాప్‌లలో నమోదు చేస్తున్నారు. సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, ఇతర వివరాల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగిస్తున్నారు. దీని వల్ల తప్పులు జరుగుతున్నాయి. సమాచార సేకరణలో ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు కొత్త యాప్ ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. గతంలో స్వయం సహాయక సంఘానికి సంబంధించిన పేర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో కనిపించేవి.

ఈ యాప్‌లో ప్రతి సంఘానికి చెందిన బృంద చిత్రం, జీవనోపాధులుంటే వాటికి సంబంధించిన చిత్రాలు తప్పనిసరిగా పొందుపరచాలి. అంతేకాకుండా సభ్యురాలు మరణిస్తే వెంటనే పేరు తొలగించి కొత్తవారిని నమోదు చేసుకోవచ్చు. ఈ విధానంతో పొదుపు మహిళలకే మేలని పక్కాగా అమలు చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ రూపొందించారు.

### వివరాలన్నీ యాప్‌లోనే..

జిల్లాలో 24 మండలాల్లో 39,671 స్వయం సహాయక సంఘాల్లో 4,34,320 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. డ్వాక్రా మహిళల ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, జీవనోపాధులు, వారి కుటుంబ సభ్యుల వివరాల్ని లోకోస్ యాప్‌లో ప్రస్తుతం నమోదు చేస్తున్నారు. ఒక్కో మండలం నుంచి ఇద్దరు యానిమేటర్లు, ఇద్దరు సీసీలకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా మిగిలిన వారికి అవగాహన కల్పిస్తున్నారు. నమూనాగా ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది సంఘాల వివరాలను రోజుకు నమోదు చేస్తున్నారు. పొదుపు సంఘంలో నమోదైన ప్రతి సభ్యురాలి వివరాలు ఇక నుంచి లోకోస్ యాప్‌లో ఉంటాయి. సంఘానికి బ్యాంకు నుంచి ఎంత రుణం ఇచ్చారు, నెలకు ఎంత వాయిదా (కిస్తీ ) చెల్లించాలి, ఎంత చెల్లించారనే విషయాలు ఎప్పటికప్పుడు సభ్యులకు తెలుస్తాయి. కొన్నిచోట్ల యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల లీడర్లు కలిసి సంఘాల నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు గతంలో వచ్చాయి. ఇక నుంచి అలాంటి వాటికి అవకాశం ఉండదు. ప్రతీదీ పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉంటాయి. నిధుల దుర్వినియోగానికి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

### ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు



లోకోస్ యాప్ వినియోగంలోకి వస్తే స్వయం సహాయక సంఘాల సమగ్ర సమాచారాన్ని సులువుగా తెలుసుకోవచ్చు. ఇప్పటికే శిక్షణ తరగతులు ముగిశాయి. సిబ్బంది డ్వాక్రా సభ్యుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారు. త్వరలోనే ఈ యాప్ పూర్తిగా వినియోగంలోకి వస్తుంది. సభ్యులు తమ గ్రూపునకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

– బి.లక్ష్మీపతి, డీఆర్‌డీఏ పీడీ

## తహసీల్దార్లకు స్థానచలనం

**తుమ్మపాల:** జిల్లాలో పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాతవరం తహసీల్దార్ పి.కనకారావును పరవాడకు, పరవాడ తహసీల్దార్ వి.ప్రకాష్‌రావును మునగపాకకు, బుచ్చెయ్యపేట తహసీల్దార్ ఎస్.వి.అంబేద్కర్‌ను నక్కపల్లికి, రోలుగుంట తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావును బుచ్చెయ్యపేటకు బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తహసీల్దార్ ఎస్.జానకమ్మను కోటవురట్లలో, విశాఖపట్నం ల్యాండ్ అక్విజిషన్ ప్రత్యేక తహసీల్దార్ జె.తారకేశ్వరిని రోలుగుంట తహసీల్దార్‌గా నియమించారు. డిప్యుటేషన్లపై వివిధ విభాగాల్లో విధుల్లో కొనసాగుతున్న అనకాపల్లి రెవెన్యూ డివిజన్ ఏవో సీహెచ్ చంద్రశేఖర్‌రావును, కలెక్టర్ కార్యాలయం అడ్మిన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావును, రీసర్వే ఓఎస్డీగా ఉన్న వై.వి.ఎస్.ఎస్.ప్రసాదరావును, అనకాపల్లి తహసీల్దార్ పి.వి.ఎల్.ఎస్.గంగాధరరావును వారి స్థానాల్లోనే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## వలంటీర్ మానవత్వం



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

**దేవరాపల్లి:** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోటలో ఉంటున్న వృద్ధురాలికి దేవరాపల్లి మండలం చింతలపూడి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.రాజేశ్వరరావు పింఛన్ సొమ్ము అందజేసి మానవత్వం చాటారు. తామరబ్బ పంచాయతీ శివారు లోవముకుందపురానికి చెందిన వృద్ధురాలు దుంబరి గౌరమ్మ పినకోటలో తన కుమార్తె వద్ద ఉంటోంది. విషయం తెలుసుకుని వలంటీర్ పింఛన్ అందజేశారు.

# గ్రీన్ మిలియన్

- నెలాఖరులోగా 10 లక్షల మొక్కలు నాటాలి
- ఈ యజ్ఞంలో జిల్లా ప్రజలంతా భాగస్వాములు కావాలి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపు
- ప్లాస్టిక్‌ను తుదముట్టిస్తేనే జీవాల మనుగడ: ఎంపీ సత్యవతి

బొజ్జన్న కొండ వద్ద మొక్కను నాటిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి





ఎస్పీ కార్యాలయంలో మొక్కలను నాటుతున్న ఎస్పీ మురళీకృష్ణ

**అనకాపల్లి టౌన్:** భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని, పరిసరాల పరిశుభ్రత విషయంలో అందరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. శంకరం పంచాయతీ బొజ్జన్న కొండ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు పది లక్షల మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. ×గ్రీన్ మిలియన్¶ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు కృషి చేయాలని కోరారు. పారిశ్రామిక పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం వలన కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ముందుగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పశుసంపద, మత్స్య సంపద తగ్గిపోతోందని, ప్లాస్టిక్‌కి బదులుగా గుడ్డ సంచుల వినియోగాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్, ఎంపీ, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఆర్వో పి.వెంకటరమణ, డీఎఫ్‌ఓ లక్ష్మణ్, డ్వామా పీడీ సందీప్, డీపీవో శిరీషారాణి, ఆర్డీవో చిన్నికృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొన్నారు.

**అడవులను అభివృద్ధి చేయాలి**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అడవులను పెంచడం వలన ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుకోగలమని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మొక్కలు నాటారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రజలు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వాతావరణ సమతుల్యత సాధించాలంటే అడవులను పెంచడం ఒక్కటే మార్గమన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఎస్‌ఐలు చక్రధర్, శ్రీనివాసరావు, రమణయ్య, భీమరాజు, వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

## ఆవు కడుపులో 30 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు

- ఆపరేషన్ చేసి రక్షించిన వైద్యులు



ఆవుకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

**బుచ్చెయ్యపేట:** కొమళ్లపూడిలో ప్లాస్టిక్ వ్యర్థాలను తిని అపస్మారక స్థితికి చేరుకున్న ఆవుకు ఆపరేషన్ చేసి ప్రభుత్వ వైద్యులు ప్రాణం పోశారు. శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న 30 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను బైటకు తీసి ఆవు ప్రాణాలను కాపాడారు. కొమళ్లపూడికి చెందిన శెట్టి త్రిమూర్తులు ఆవు సోమవారం ఉదయం స్పృహ తప్పి పడిపోయింది. సపర్యలు చేసినా లేవలేదు. వెంటనే వడ్డాది ప్రభుత్వ పశువైద్యాధికారి శివకుమార్‌కు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ సమాచారం అందించారు. ఇటీవల పెళ్లిలో పాడైన అరిసెలు ఆవుకు పెట్టామని, అరిసెలు అరగక ఆవు అపస్మారక స్థితికి చేరిందని రైతు త్రిమూర్తులు వైద్యాధికారికి తెలిపారు. దీంతో ఆపరేషన్ చేసి అరిసెలు బయటకు తీయాలని వైద్యుడు నిర్ణయించారు. రోలుగుంట పశు వైద్యాధికారి సూకేష్‌తో కలిసి వడ్డాది పశు వైద్యాధికారి శివకుమార్ ఆవుకు ఆపరేషన్ చేశారు. ఆవు కడుపులో అరిసెలు లేకపోగా కడుపునిండా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటాన్ని గమనించారు. 30 కేజీల బరువున్న ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వైర్లను ఆవు కడుపు నుంచి బైటకు తీశారు. ఐదారు గంటలపాటు శ్రమించి ఆపరేషన్ చేసిన వైద్యులు.. ఆవుకు స్పృహ వచ్చే వరకు సపర్యలు చేశారు. ఆవును బతికించిన వైద్యులకు రైతు త్రిమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. కొమళ్లపూడి, లోపూడి సచివాలయ పశు వైద్య సహాయకులు కన్నంనాయుడు, సాయి కృష్ణలు వైద్యులకు సహకరించారు.

## విశాఖలో రక్షణ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్



లెఫ్టినెంట్ జనరల్ అరవింద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ గుప్తా

**సాక్షి, విశాఖపట్నం :** రక్షణ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అరవింద్ వాలియా విశాఖలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా తూర్పు నౌకాదళాన్ని సందర్శించిన అరవింద్‌ను.. ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. తూర్పు నౌకాదళంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. సముద్ర భద్రతకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆధునిక సౌకర్యాల కల్పన కోసం.. చేపడుతున్న పనులకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తామని లెఫ్టినెంట్ జనరల్ అరవింద్ హామీ ఇచ్చారు.

# అందరూ సేఫ్

- లభ్యం కాని ఒకే ఒక్కరి ఆచూకీ
- నిలకడగా ప్రమాద బాధితుల ఆరోగ్యం
- పలు ఆస్పత్రుల్లో 8 మందికి చికిత్స
- మెరుగైన వైద్యం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒడిశా అధికారులతో నిరంతర చర్చలు



ప్రభుత్వం అందజేసిన చెక్కులతో మాధవరావు, భారతి



శంకరరావుకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**సాక్షి, విశాఖపట్నం:** యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఒడిశా రైలు ప్రమాదంలో విశాఖకు చెందిన ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారు. ఒకే ఒక్క ప్రయాణికుడి ఆచూకీ ఇంత వరకూ లభ్యం కాలేదు. ఒడిశాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 8 మంది ప్రయాణికులను రాష్ట్ర ప్రభుత్వం విశాఖకు తీసుకొచ్చి.. మెరుగైన వైద్యం అందిస్తోంది. స్వల్ప గాయాలతో బయటపడిన వారందరికీ ప్రభుత్వం తక్షణ సాయం కింద పరిహారం అందించింది. అయితే జనరల్ బోగీల్లో ప్రయాణించిన వారిలో ఎవరైనా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారున్నారా అనే అంశంపై నిరంతరం ఒడిశా ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఇంతవరకూ కుటుంబ సభ్యుల నుంచి తమ వారి ఆచూకీ తెలియలేదన్న ఫోన్ కాల్స్ ఏపీ కంట్రోల్ రూమ్‌కు రాకపోవడంతో.. ప్రస్తుతం గుర్తు తెలియని మృతదేహాల్లో ఇక్కడి వారు ఎవరూ ఉండరని అంతా భావిస్తున్నారు.

పెను విషాదాన్ని మిగిల్చిన ఒడిశా రైలు ప్రమాదానికి సంబంధించి ప్రయాణికుల ఆచూకీ తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. రాష్ట్రానికి చెందిన ప్రతి ప్రయాణికుడినీ సురక్షితంగా ఇళ్లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం నిరంతరం పనిచేస్తోంది. ప్రమాదానికి గురైన కోరమండల్, యశ్వంత్‌పూర్ రైళ్లలో రిజర్వేషన్ కోచ్‌లలో మొత్తం 342 మంది విశాఖ నుంచి ప్రయాణం చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. వారి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. 10 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా.. ఆరుగురు మినహా అందరూ సురక్షితంగా ఉన్నట్లు గుర్తించారు. మరో ఎనిమిది మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో వారందరినీ.. ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా విశాఖ తీసుకొచ్చారు. కేజీహెచ్, సెవెన్‌హిల్స్, క్యూ1, అపోలో, ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణి ఆస్పత్రుల్లో చేర్పించి.. మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వీరిలో సెవెన్ హిల్స్‌లో చికిత్స పొందుతున్న లోకేష్, మిన్నీ దంపతులను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. వారిని ప్రత్యేక వాహనంలో వారి స్వస్థలానికి అధికారులు పంపించారు. మిగిలిన ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

**ఆ ఒక్కరూ ఎవరు.?**

మొత్తం ప్రయాణికుల్లో ఆరుగురి ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి ఒడిశా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ఆరుగురు వివరాలను పంపించిన అధికారులు.. ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారితో మ్యాచ్ చేయాలని కోరారు. రైల్వే అధికారులు, ఒడిశా ఐఏఎస్ అధికారులు, వైద్య సిబ్బంది కలిసి వారి వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు ఐదుగురు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామని జిల్లా అధికారులకు తెలిపారు. అయితే ఎవరెవరు సురక్షితంగా ఉన్నారు.. ఇంకా ఎవరి ఆచూకీ దొరకలేదన్న దానిపై స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఆ ఒక్కరు ఎవరు..? ఎక్కడ ఉన్నారు.. ఏ పరిస్థితుల్లో ఉన్నారనే వివరాల కోసం నిరంతరం శ్రమిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ బోగీల్లో కాకుండా.. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి వివరాలు మాత్రం ఎవ్వరికీ దొరకలేదు. ఇంతవరకూ కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు తమ వారు కనిపించలేదని ఫిర్యాదులు రాలేదు.

### రైలు బాధిత కుటుంబ సభ్యులకు చెక్కుల అందజేత

**మహారాణిపేట (విశాఖపట్నం):** ఒడిశా రైలు ప్రమాద ఘటనలో గాయపడిన, మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రైలు ప్రమాదంలో గాయపడి విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి.. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ రైలు ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తనతో పాటు, ముగ్గురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. అధికారులతో కలిసి తాము 10 గంటల్లో ప్రమాద స్థలికి చేరుకున్నామని చెప్పారు. అధికారులు హుటాహుటినా రంగంలోకి దిగి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 342 బాధితులు ఉన్నారని గుర్తించారని చెప్పారు. వారిని భువనేశ్వర్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి అనే వ్యక్తి మాత్రమే మరణించారన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అభినందించారని తెలిపారు.

# అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆత్మహత్య

ఎస్.రాయవరం: ఫ్యానుకు ఉరేసుకుని అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ లాం జనిత్ (21)ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చోడవరానికి చెందిన లాం మనోహర్ మూడో కుమారుడు లాం జనిత్ ఎస్.రాయవరం పోస్టాఫీస్‌లో ఏబీపీఎంగా పనిచేస్తూ అక్కడే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శనివారం స్వగ్రామం చోడవరం నుంచి ఎస్.రాయవరం వచ్చి విధుల్లో చేరుతున్నట్టు కుటుంబ సభ్యులకు చెప్పాడు. అదే రోజు సాయంత్రం నుంచి ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం లేదు. సోమవారం ఉదయం ఇంటి ఓనర్‌కు ఫోన్ చేయగా, ద్విచక్ర వాహనం ఇంటి వద్ద ఉందని, కిటికీ నుంచి దుర్వాసన వస్తున్నట్టు చెప్పడంతో వారు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందినట్టు గుర్తించారు. స్థానికులు సహాయంతో తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. తమ కుమారుడు ప్రేమ వ్యవహారంలో విఫలమై, మానసిక ఒత్తిడికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని, మృతి పట్ల ఎటువంటి అనుమానాలు లేవని అతడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



## హైదరాబాద్ వెళ్లి క్షతగాత్రునికి పింఛన్ అందజేత


వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గిరిజారూప

అనకాపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వడ్డాది కాశీవిశ్వనాథం చేతికి పింఛన్ సొమ్ము అందింది. హైదరాబాద్‌లో నివాసముంటున్న తన కుమారుడు వంశీ ఇంటికి మార్చి నెలాఖరున అతడు వెళ్లాడు. ఆ సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి అక్కడే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో మూణ్నెల్ల పాటు పింఛన్ తీసుకోకపోతే నిలిచిపోతుందని తెలుసుకుని ఆదివారం అక్కడకు వెళ్లి పింఛన్ అందజేసినట్లు అనకాపల్లి వేల్పులవీధి క్లస్టర్ లోకావారివీధికి చెందిన వలంటీర్ భీశెట్టి గిరిజారూప సోమవారం తెలిపారు.

## బాణసంచా గొడౌన్‌లో అగ్నిప్రమాదం

అనకాపల్లి టౌన్: మండలంలో కొప్పాక హిందూ శ్మశానవాటిక సమీపంలో బాణసంచా గొడౌన్‌లో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు, పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. గొడౌన్‌లో అనధికారకంగా ఉంచిన బాణసంచా స్వల్పంగా కాలిపోయింది. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా వీఆర్వో నుంచి ఫిర్యాదు అందలేదన్నారు.

# నేడు మాడుగుల మోదమ్మ పండగ

- భారీ స్థాయిలో ఏర్పాట్లు
- పెద్ద ఎత్తున రానున్న భక్తజనం
- ఆకట్టుకుంటున్న సురభి నాటక ప్రదర్శనలు


చల్లని తల్లి మోదకొండమ్మ


ముస్తాబయిన అమ్మవారి ఆలయం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతున్న మాడుగుల మోదకొండమ్మ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఇక్కడ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా వాసులతోపాటు విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యూలైన్లు, మంచినీరు తదితర ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.

**పలు సాంస్కృతిక కార్యక్రమాలు...**

అమ్మవారి ఆలయం నుంచి శతకంపట్టు వరకు కళ్లు మిరమిట్లు గొలిపే విధంగా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఇక్కడ మహరాజుల కోటలో హైదరాబాద్ వారి సురభి నాటకాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం సాయంత్రం భక్త ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించనున్నారు. వీటితోపాటు డ్యాన్స్ హంగామా, సినీ నృత్య ప్రదర్శనలు, చిత్ర విచిత్రమైన నేల వేషాలు నడుమ అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు గ్రామంలో ఊరేగించి తిరిగి ఆలయానికి చేరడంతో అమ్మవారి నెల రోజుల పండగ పూర్తవుతుంది. మహిళా కళాకారులుతో డప్పు వాయిద్యాలు, కేరళ డమరుక నాదాలతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

**120 మంది పోలీసులతో గట్టి బందోబస్తు**

అనకాపల్లి డీఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌ఐ దామోదరనాయుడు ఆధ్వర్యంలో 120 మంది పోలీసు బందోబస్తు నడుమ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆలయానికి కిలోమీటరు మేర దూరంలో కార్లు, బైక్‌లు నిలుపుదల చేయడానికి వేంకటేశ్వర ఆలయ ప్రాంగణం సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సులకు స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి



మాడుగుల మోదకొండమ్మ పండగను అందరి సహకారంతో నిర్వహిస్తున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీతోపాటు పోలీసులకు భక్తులు సహకరించాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– పుప్పాల అప్పలరాజు, ఆలయ కమిటీ చైర్మన్, మాడుగుల

# నిర్ణీత గడువులోగా ప్రతి అర్జీకి పరిష్కారం


స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో వెంకటరమణ


అర్జీదారుని సెల్‌ఫోన్‌లో సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ మురళీకృష్ణ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ స్పందనకు 220 అర్జీలు

తుమ్మపాల: స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించి అర్జీదారుడిని సంతృప్తి పరచాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా మండల స్థాయిలో ఫిర్యాదులకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ఒక వేదిక ద్వారా అర్జీదారుడి నుంచి క్షుణ్ణంగా సమస్యను తెలుసుకుని తక్షణ పరిష్కార మార్గం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకూడదన్నారు. ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపై పరిష్కరించదగినవి, లేనివి పరిశీలించి అర్జీదారుడికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. కలెక్టరేట్ వీసీ హాలులో స్పందన కార్యక్రమానికి మెట్ల మార్గంలో వెళ్లలేక అర్జీల నమోదు కేంద్రం వద్ద ఉండిపోయిన దివ్యాంగులు, వృద్ధుల వద్దకు డీఆర్వో పి.వెంకటరమణ వచ్చి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారంపై చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్వో తెలిపారు. ఈ వారం 220 అర్జీలు నమోదయ్యాయి. కార్యక్రమంలో డీఎల్‌డీవో మంజులావాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఈ వారం స్పందనకు వచ్చిన వాటిలో కొన్ని..**

- రైతు భరోసా వస్తున్నప్పటికి పీఎం కిసాన్ నగదు మాత్రం రావడం లేదంటూ రావికమతం మండలం మారుపాక గ్రామానికి చెందిన రైతు ముప్పల రామకృష్ణ స్పందనలో కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు.
- నివాస ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడం లేదని నర్సీపట్నం తహసీల్దారుపై పెదబొడ్డేపల్లికి చెందిన పోతురాజు వరహాలమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. భర్త మరణించడంతో అతని పేరున పట్టా పత్రాల్ని తన మరిది ఇవ్వడం లేదని వాపోయింది.
- అనుమతులు లేని క్వారీలను నిలిపివేయాలంటూ అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో అనధికారకంగా ఐదు క్వారీలను నిర్వహించడంతో 20 మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో మరణించారని వాపోయారు. మైనింగ్, విజిలెన్స్, పోలీస్ సంబంధిత శాఖలకు ఫిర్యాదులు చేశామన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో స్పందనలో 30 అర్జీలు**

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయానికి స్పందనలో సోమవారం 30 అర్జీలు వచ్చాయి. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీదారుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. సానుకూలంగా స్పందించి చట్టపరిధిలో వాటి పరిష్కారానికి కింద స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలుపై అర్జీలు వచ్చినట్లు ఎస్పీ చెప్పారు. జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు పాలైన బీరు

- బయ్యవరం వద్ద బీరు సీసాల లోడు వ్యాన్ బోల్తా


బయ్యవరం వద్ద బోల్తా పడిన బీరు సీసాల లోడు వ్యాన్

కశింకోట: అసలే మండు వేసవి... రోడ్డుపై బీరు సీసాల లోడు వ్యాన్ బోల్తా పడింది. మందుబాబులకు ఇంకేం కావాలి? వెంటనే అక్కడికి వచ్చి వాలిపోయారు. అందినకాడికి బీరు సీసాలు చేజిక్కించుకున్నారు. కశింకోట మండలం బయ్యవరంలో రైల్వే వంతెన వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తుండగా, వ్యాన్‌పైన బీరు సీసాల బరువు ఎక్కువై అదుపు తప్పిందని సమాచారం. దీంతో రోడ్డు పాలైన బీరు సీసాల ఖరీదు సుమారు రూ. లక్ష ఉంటుందని అంచనా. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## 13 కేసుల్లో పట్టుకున్న గంజాయికి తూనిక


గంజాయికి తూనిక వేస్తున్న పోలీసు సిబ్బంది

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 13 కేసుల్లో పట్టుకున్న గంజాయికి సోమవారం తూనిక వేశారు. జిల్లా ఎస్పీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు ఇక్కడ తనిఖీ చేశారు. గతంలో పట్టుకున్న మేరకు గంజాయి ఉందా లేదా అని తెలుసుకునేందుకు తూకం వేసి లెక్క సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 కేసుల్లో 308 కేజీల గంజాయి పట్టుకోగా, తూనిక వేయగా సరిగ్గా ఉందన్నారు. జిల్లా పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న గంజాయిని పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో త్వరలో తగులబెడతామన్నారు. ఎస్‌ఐ ఉపేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పశువుల పాక దగ్ధం

- ఆవు మృతి


కాలిపోతున్న పశువుల పాక

మునగపాక: మండలంలోని చెర్లోపాలెంలో పశువుల పాక దగ్ధమైంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో ఆవు మృతి చెందింది. రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతు దవులూరి కొండమ్మ అధికారులను కోరుతున్నారు.

## కరాటే టెస్టులో సత్తా చాటిన క్రీడాకారులు


కరాటే టెస్టులో విజయం సాధించిన క్రీడాకారులు

నర్సీపట్నం: రైయిస్ రియు ఫాతోకస్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక స్కేటింగ్ రింగ్‌లో క్రీడాకారులకు కరాటే బెల్ట్ టెస్టు నిర్వహించారు. ఇందులో తొమ్మిది మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. వై.అనన్య ఆరెంజ్ బెల్ట్, డి.జస్మిత భవ్య ఎల్లో బెల్ట్, డి.మహాలక్ష్మి ఎల్లో బెల్ట్, జి.లికితరామ్ ఎల్లో బెల్ట్, ఆర్.నైతిక్ ఎల్లో బెల్ట్, ఎల్.సోబిత్ బ్లూబెల్ట్, బి.చేతస్ ఆరెంజ్ బెల్ట్, ఎ.కె.మనోజ్‌కుమార్, ఆర్.హేమంత్ బ్లాక్ బెల్ట్‌కు ఎంపికయ్యారని కరాటే మాస్టర్ కె.ప్రసాద్ తెలిపారు. ఆర్పీ మార్షల్ ఆర్ట్ అకాడమి చైర్మన్ వెలగా నారాయణరావు, మెంబరు కె.కిశోర్, కోచ్ ఆర్.ప్రసాద్ క్రీడాకారులను అభినందించారు.

## ఏలేరు కాలువలో పడిపోయిన యువకులు

- ఒకరిని చీరతో కాపాడిన మహిళ
- మరొకరు మృతి


ఏలేరు కాలువలో జల్లెడ పడుతున్న అగ్నిమాపక సిబ్బంది


ఒడ్డుకు తీసుకొచ్చిన దిలీప్‌కుమార్ మృతదేహం


బొండాడ దిలీప్ కుమార్(ఫైల్)

అనకాపల్లి టౌన్: మండలంలోని ఏఎంఏఎల్ కళాశాల సమీపాన ఏలేరు కాలువలో ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయారు. అటుగా వెళ్తున్న మహిళ చీరతో ఒకరిని కాపాడగా, మరొకరు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు... గవరపాలెం సతకంపట్టు ప్రాంతానికి చెందిన బొండాడ దిలీప్‌కుమార్(24), కె.గోవింద(23) పట్టణంలో ఓ హోటల్‌లో రెండు బిర్యానీ ప్యాకెట్లు తీసుకుని ఏలేరు కాలువ గట్టుపై భోజనం చేశారు. అక్కడ కాలువలో ఇద్దరు చేతులు శుభ్రం చేసుకోవడానికి దిగగా, ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయారు. అదే సమయంలో వ్యవసాయ పనులు ముగించుకుని అటుగా వెళ్తున్న మహిళ చూసి తన చీరను కాలువలోకి విసిరింది. వారిలో గోవిందు చీర పట్టుకుని ఒడ్డుకు చేరుకోగా, దిలీప్‌కుమార్ కాలువలో మునిగిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు రాత్రంతా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గాలించగా, సత్యనారాయణ స్వామి కొండ సమీపాన కాలువలో మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడు తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

## ధ్వంసం చేసిన చెరకు తోటల పరిశీలన


చెరకు పంటలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చోడవరం: పట్టణ శివారు అన్నవరం రెవెన్యూ పరిధిలో అడవిపందులు ధ్వంసం చేసిన చెరకు తోటలను అటవీ అధికారులు సోమవారం పరిశీలించారు. పలువురు రైతులకు చెందిన మొక్క చెరకు తోటలను అడవి పందులు నాశనం చేయడంతో రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో చోడవరం సెక్షన్ అటవీ అధికారులు పరిశీలించారు. వాటిని తరిమేందుకు ప్రయత్నించగా, దాడి చేసేందుకు ప్రయత్నించాయని, వెంటనే భయంతో వెనక్కి వచ్చేశామని బాధిత రైతులు పొట్నూరు సింహాచలం, పుల్లేటి సత్యనారాయణ, చిట్టిబాబు వాపోయారు. పంట నష్టపరిహారానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామని చోడవరం అటవీశాఖ సెక్షన్ డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. అడవిపందులను చంపడం నేరమన్నారు.

## 10 వేల మొక్కలు నాటాలని లక్ష్యం


మొక్కలు పంపిణీ చేస్తున్న వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు


గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

- గోవాడ సుగర్స్ బృహత్తర కార్యక్రమం

చోడవరం: గోవాడ చక్కెర కర్మాగారం ఆధ్వర్యంలో 10 వేల మొక్కలను నాటుతున్నామని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆవరణతోపాటు చెరకు కాటాల వద్ద, పాఠశాలల్లో, గోవాడ, అంబేరుపురం గ్రామాల్లో 10 వేల మొక్కలు నాటనున్నామని చెప్పారు. ఇప్పటికే మొక్కలను ఫీల్డు సిబ్బంది ద్వారా ఫ్యాక్టరీ, చెరకు కాటాల వద్దకు చేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీసీ పీఎస్ఎస్‌వి ప్రసాద్, సీఏఓ ఎస్ఎల్ సత్యనారాయణ, సీఈ పి. ప్రసాదరావు, సీడీఓ రామం, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పీపీ రవి పాల్గొన్నారు.

**కుసుర్లపూడిలో 500 మొక్కల పంపిణీ**

రోలుగుంట: కుసుర్లపూడి గ్రామంలో వృక్షమిత్ర సమితి వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు సోమవారం వివిధ జాతులకు చెందిన 500 మొక్కలను స్థానిక జెడ్పీ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ గొల్లు రాజబాబుతో కలిసి పంపిణీ చేశారు. ఏడాది పొడవునా మరో లక్ష మొక్కలు నాటనున్నామని ఆయన చెప్పారు.

## క్లుప్తంగా

### నూతన ఎంపీడీవో బాధ్యతల స్వీకారం


రవికుమార్

కశింకోట: మండలాన్ని అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఎంపీడీవో వి.వి.రవికుమార్ అన్నారు. ఎంపీడీవోగా సోమవారం కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా మెంట్యాడలో ఈఓఆర్‌డిగా పని చేసి పదోన్నతిపై ఎంపీడీవోగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు జాతీయ ఉపాధి హామీ పథకంలో మంగళవారం నుంచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గ్రామాల వారీగా మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.

### 14 నుంచి 'మహా మృత్యుంజయ హోమం'

అనకాపల్లిటౌన్ : బట్లపూడి గ్రామంలో సోహం ఆశ్రమంలో లోక కల్యాణార్థం ఈనెల 14 నుంచి అక్టోబర్ 11వ తేదీ వరకూ 90 రోజుల పాటు 'మహా మృత్యుంజయ హోమం' ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు ఆశ్రమం వ్యవస్థాపకుడు కాండ్రేగుల రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రెండు కేజీలు ఆవు నెయ్యి, పూజా సామాగ్రిని తీసుకుని రావాలని కోరారు. పూజలో పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. హోమంలో పాల్గొనే భక్తులు ముందుగానే వారి పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. వివరాలకు 9966908908 నంబరును సంప్రదించాలన్నారు.

### 14న సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్టు అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు కె.వి.గౌరీపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.నారాయణమూర్తి, కార్యదర్శి కె.రామచంద్రరావు విచ్చేయుచున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో అసోసియేషన్ సభ్యులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 71 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | ---- | ---- |
| రెండో రకం | ---- | ---- |
| మూడో రకం | 3,650 | 4,000 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| కస్టడీ | : రాజా |
| అహింస | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| పరేషాన్ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| ది కేరళ స్టోరీ | : షిర్డిసాయి |
| విరూపాక్ష | : పర్తిసాయి |
| చక్రవ్యూహమ్ | : వెంకటేశ్వర |
| నేను స్టూడెంట్ సర్ | : శ్రీసత్య |
| బిచ్చగాడు-2 | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 9 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# పేదవాడి పంకాకు ఉక్కబోత

- క్రమేణా కనుమరుగవుతున్న విసనకర్ర
- ఎలక్ట్రానిక్ యుగంలో తగ్గిపోతున్న ఆదరణ
- గిట్టుబాటు లేక తయారీదారుల ఇబ్బందులు


చల్లని గాలినిచ్చే తాటాకు విసనకర్రలు

అనకాపల్లి రూరల్: నాటి కాలంలో రాజులు, జమీందారులకు వింజామరలు, సామాన్యులకు విసనకర్ర చల్లటి గాలినిచ్చేవి.రాజులు పోయారు వింజామరలు మాయమయ్యాయి. సామాన్యుడు ఉన్నా విసనకర్ర కనిపించడం లేదు. దశాబ్దాలుగా విసనకర్ర పేదవాడి గాలి పంకాగా సేవలందిస్తోంది. అత్యంత చౌకగా లభించే ఈ విసనకర్రకు నేటి ఎలక్ట్రానిక్ యుగంలో ఆదరణ తగ్గిపోయింది. విద్యుత్ ఉపకరణాలు, అత్యాధునిక వసతులు అందుబాటులోకి రావడంతో విసనకర్ర ఉపయోగం సంచార,కార్మిక,నిరుపేద వర్గాలకే పరిమితమైంది. దీంతో విసనకర్రలకు అంతంత మాత్రంగానే ఆదరణ లభిస్తోంది. గతంలో ఇన్వెర్టర్ల సదుపాయం లేకపోవడంతో పల్లె ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ తాటాకు, ఈత ఈనెలు,అరటి డొప్ప నారతో తయారు చేసే విసనకర్రలను విరివిగా ఉపయోగించుకుని చల్లని గాలితో సేద తీరేవారు. మారిన కాలమాన పరిస్థితుల్లో ఎయిర్ కండిషన్లు, సీలింగ్,బ్యాటరీ ఫ్యాన్లు, భారీ ఇన్వర్టర్లు, జనరేటర్లు అందుబాటులోకి రావడంతోపాటు విద్యుత్ కోతలు లేకపోవడం వలన చల్లని గాలినిచ్చే ఫ్యాన్లు నిత్యం గిరగిరా తిరుగుతున్నాయి. దీంతో విసనకర్రల అవసరం లేకుండా పోయింది. గతంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం,కాలుష్యం తక్కువగా ఉండటంతో దోమల బెడద ఉండేది కాదు. వేసవిలో ఇళ్ల ముంగిట ఆరుబయటే మంచాలు,వీధి అరుగులపై జనం నిద్రించేవారు. ఆ సమయంలో విసనకర్రను తమ పక్కనే ఉంచుకుని నిద్రించేవారు. ప్రస్తుతం దోమల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడం, పట్టణాలు, పల్లెలు సైతం కాంక్రీటు జంగిళ్లుగా మారిపోవడం, చెట్లు తగ్గిపోవడంతో స్వచ్ఛమైన గాలి కరువవుతోంది. దీనికితోడు భద్రత రీత్యా ఆరుబయట నిద్రపోయే అలవాటు బాగా తగ్గిపోయింది. దీంతో విసనకర్రల వినియోగం బాగా తగ్గిపోయింది. నేటి తరానికి విసనకర్ర అంటేనే తెలియని పరిస్థితి ఏర్పడింది. గతంలో వేసవికి ముందు వచ్చే ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగలకు దేవాలయాల వద్ద పలువురు విసనకర్రలను పంపిణీ చేసేవారు. ఇప్పుడు అలాంటి దృశ్యాలు ఎక్కడా కన్పించడంలేదు. వేసవికాలం వచ్చిందంటే ఉభయ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జిల్లాలో ముఖ్య పట్టణాలకు తాటి కమ్మలతో చేసిన విసనకర్రలు దిగుమతి అయ్యేవి. వీటి విక్రయాలు గతంలో బాగా జరిగేవి. ప్రస్తుతం అనకాపల్లి మార్కెట్లో ఒకే ఒక దుకాణంలో చాలా తక్కువ సంఖ్యలో విసనకర్రలు విక్రయానికి ఉంచారు. వీటి అమ్మకాలు చాలా తక్కువగా ఉంటున్నాయని విక్రయదారులు చెబుతున్నారు. ఒక్కో విసనకర్ర రూ.30 నుంచి రూ.50 వరకు ధర ఉంటోంది.

### విద్యుత్ కోత సమయంలో ఉపయోగం



ఇప్పటికీ మా ఇంట్లో విసనకర్ర వినియోగిస్తున్నాం. రాత్రి వేళల్లో చెంతనే విసనకర్ర ఉంచుకుని నిద్రించడం మా నాన్నకు ఇప్పటికీ అలవాటే. ఈ సీజన్‌లో అరడజను విసనకర్రలు కొనుగోలు చేసి ఇంట్లో భద్రపరుచుకున్నాం. భారీ గాలులు, వర్షాల సమయంలో గానీ సాంకేతిక సమస్య కారణంగా గానీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే విసనకర్రలు బాగా ఉపయోగపడుతున్నాయి.

–సీహెచ్ రాణి, అనకాపల్లి

### తగ్గిన వినియోగం



గతంతో పోల్చితే విసనకర్రల వినియోగం బాగా తగ్గిపోయింది. ఏసీలు, కూలర్లు, వివిధ రకాల ఫ్యాన్ల వినియోగం పెరిగిపోవడం వల్ల విసన కర్రల అవసరం తగ్గిపోయింది. అయితే తుపాన్లు, విద్యుత్తు సరఫరా నిలిచిపోయినప్పుడు ఇళ్లలో విసనకర్రలపైనే ఆధారపడక తప్పదు. మరికొంత కాలం తర్వాత విసనకర్రల తయారీ పూర్తిగా ఆగిపోయే అవకాశం ఉంది.

– బి.సాయిదుర్గా ప్రసాద్, వేంపాడు

## నూతన ఉపాధ్యాయులకు శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న మాణిక్యం నాయుడు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందని విశాఖ ఉమ్మడి జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు అన్నారు. స్థానిక జెఎంజె హైస్కూల్లో నూతనంగా వృత్తిలో చేరిన ఉమ్మడి విశాఖ జిల్లాల ఉపాధ్యాయులకు ఇండక్షన్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని ఆయన కోరారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారిణి డాక్టర్ జి.లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ అధ్యాపకుడు షేక్ అల్లాఉద్దీన్, డైట్ అధ్యాపకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వృద్ధులు నిత్యం వ్యాయామం చేయాలి

అనకాపల్లిటౌన్: మారతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులు ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సాధించాలని ఫిజియోథెరపీ వైద్యుడు కాండ్రేగుల వెంకటేష్ సింహాచలం అన్నారు. గవరపాలెం వి.వి.రమణ రైతు భారతిహాల్లో జిల్లా గ్రామీణ వయోవృద్ధుల వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సెకండ్ల టైము తీసుకుని గోడకు అరచేతిని మోపి ముందుకు వెనకకు నెమ్మదిగా ఊగుతుంటే చేతి, కాళ్ల నరాలు పట్టు బిగిస్తాయని చెప్పారు. ఫిజియోథెరపీలో ఎన్నో రకాలైన వ్యాధులకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో వృద్ధులు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. నిత్యం మూడు నుంచి నాలుగు కిలో మీటర్లు నడకతో శరీరంలో అన్ని అవయవాలకు రక్త ప్రసరణ బాగా జరుగుతుందని చెప్పారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు వైద్యుడు సింహాచలం నాయుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల కృష్ణ అప్పారావు, సభ్యులు శరగడం నూకరాజు, కాండ్రేగుల అప్పారావు పాల్గొన్నారు.

## గవర కులస్తులను బీసీఏకు మార్పు చేయాలి


విలేకర్లతో మాట్లాడుతున్న గౌరీసేన ఐక్య సమాఖ్య చైర్మన్ ఉమాశంకరరావు

అనకాపల్లిటౌన్ : గవర కులస్తులను బీసీడీ నుంచి బీసీఏ కు మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందని అంతర్జాతీయ గౌరీసేన ఐక్య సమాఖ్య చైర్మన్ ఆడారి ఉమా శంకరరావు అన్నారు. స్థానిక విజయారె సిడెన్సీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 16న గవరపాలెం సుబ్రహ్మణ్యం కల్యాణ వేదికలో గవర కులస్తుల చర్చావేదిక ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉదయం 8 గంటలకు గవరపాలెం నుంచి జై గవర.. జై జై గవర నినాదంతో అంతర్జాతీయ గవర కుటుంబసభ్యుల ఊరేగింపు ఉంటుందని, 10 గంటలకు చర్చావేదిక ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఉచిత భారీ వైద్యశిబిరంతోపాటు గవర కులస్తుల ఉత్తమ విద్యార్థులు, వివిధ హోదాల్లో పని చేస్తున్న వారిని సత్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కోరిబిల్లి సత్యనారాయణ, కాండ్రేగుల వెంకటలక్ష్మి, సూరిశెట్టి రమేష్, శరగడం లక్ష్మి, కాండ్రేగుల చందు పాల్గొన్నారు.

## కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు


కశింకోట వద్ద దుర్గ వీధిలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో నాటుతున్న మొక్కలు

కశింకోట: పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని రిటైర్డు అటవీ శాఖ రేంజర్ బీరా వినోద్‌కుమార్ అన్నారు. కశింకోట వద్ద దుర్గా వీధిలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం మానవ మనుగడకు ముప్పుగా పరిణమిస్తోందన్నారు. మానవ తప్పిదాలు, ఆధునిక జీవన విధానం ఆచరణ, ప్లాస్టిక్ విస్తృత వినియోగం జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసి పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయన్నారు. దీని నివారణకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. వృక్ష మిత్ర పురస్కార గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వభారతి జూనియర్ కళాశాల కరస్పాండెంటు మళ్ల మురళి, ఉపాధ్యాయుడు రెడ్డి నారాయణరావు, ప్రతినిధులు బేతాల శేషసాయి, పతివాడ మూర్తి పాల్గొన్నారు.

## కౌలు రైతు చట్టాన్ని సవరించాలి


తాళ్లపాలెం సంతలో జీపు యాత్రలో భాగంగా ప్రచారం చేస్తున్న ఏపీ కౌలు రైతు సంఘం కార్యదర్శి హరిబాబు

కశింకోట: కౌలు రైతు చట్టాన్ని సవరించాలని ఏపీ కౌలురైతు సంఘం కార్యదర్శి ఎం. హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కౌలు రైతు చట్టం సవరణపై అవగాహనకు ప్రచారం చేస్తూ జీపు యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు చట్టంలో భూ యజమాని సంతకం తొలగించాలని, ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు అందించాలన్నారు. జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా ప్రజా నాట్య మండలి సభ్యులు ఎం.వి.రమణ, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కె.రాంబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చురుగ్గా సామాజిక భవన నిర్మాణం


కశింకోటలోని పంచాయతీ కార్యాలయం ఎదుట సామాజిక భవనం నిర్మాణ పనులు

కశింకోట : కశింకోటలోని పంచాయతీ కార్యాలయం ఎదుట వారపు సంత ప్రాంతంలో అరబిందో ఫార్మా పరిశ్రమ ఆధ్వర్యంలో రూ.80 లక్షలతో సామాజిక భవనం(కల్యాణ మండపం) నిర్మాణ పనులు చేపట్టి నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా పునాది మట్టి తీసే పనిని పొక్లెయిన్‌తో నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పనులను సోమవారం పర్యవేక్షించారు.

## గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి కార్డులివ్వాలి


కౌలురైతుల రక్షణయాత్రను ప్రారంభిస్తున్న కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

మునగపాక: గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలురైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. కౌలురైతుల రక్షణయాత్రను ఆయన సోమవారం మునగపాక నుంచి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సాయం అందడం లేదన్నారు. పంటల బీమా, రైతు భరోసా తదితర సేవలకు నోచుకోలేకపోతున్నారన్నారు. కౌలురైతులకు సీసీఆర్ కార్డులు అందించాలన్నారు. ఈ కార్డులు ఉన్నవారికి బ్యాంకుల నుంచి రూ.లక్ష వరకు రుణసాయం అందుతుందన్నారు. భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు కార్డులు ఇస్తామన్న నిబంధన తొలగించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రైతు భరోసాను రూ.25వేలకు పెంచాలని, కేరళ తరహాలో రుణ విముక్తి చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. సన్న,చిన్న కారు రైతుల రుణాలు రద్దు చేయాలన్నారు. పలు జిల్లాల మీదుగా ఈ యాత్ర ఈ నెల 12వ తేదీనాటికి మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కమిషనర్ కార్యాలయం వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ అధ్యక్షులు కర్రి అప్పారావు,సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు,, వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు,సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ,పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అతిసార నియంత్రణకు జాగ్రత్తలు అవసరం

పాయకరావుపేట : ఈ నెల 5 నుండి 17 వ తేదీ వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో అతిసార నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలలో భాగంగా జింక్ , ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఏవిధంగా తీసుకోవాలో ప్రజలందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ పద్మప్రియ, ఎంపీహెచ్‌ఈఓ రమణ, ఎంపీహెచ్‌ఈఓ గణేష్, ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : చిన్న పిల్లలు అతిసార వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్‌ఆజిద్ అన్నారు. పి.ధర్మవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు వేసవి రోజుల్లో ఈ వ్యాధి బారిన పడుతుంటారని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిసార లక్షణాలు కనిపిస్తే అవసరమైన వైద్యసేవలు చేయించాలని చెప్పారు.

# పచ్చని మొక్కలతో పచ్చగా పర్యావరణం


డైట్ కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు


కశింకోటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మొక్కలు నాటుతున్న అరుణ


బెల్లంమార్కెట్ యార్డులో మొక్కను నాటుతున్న వైద్యుడు డిడి.నాయుడు

తుమ్మపాల: పర్యావరణాన్ని కాపాడడం వల్ల భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నరసింహం అన్నారు. పట్టణంలో దాడి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ అన్నారు. ప్రతి విద్యార్థి వారి ఇళ్లు, పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. పచ్చని మొక్కలు పచ్చని వాతావరణం ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కో-ఆర్డినేటర్ వి. ధర్మారావు ఆధ్వర్యంలో ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యులు తమ గ్రామాల్లో మొక్కలు నాటడానికి మహిళా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి అప్పలనరసమ్మ, ఎల్.సి. శ్రీనివాసరావు, స్త్రీ నిధి మేనేజర్ వెంకినాయుడు, సీసీలు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పట్టణ, మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో క్లబ్ ఏరియా అధ్యక్షుడు, వైద్యుడు డిడి.నాయుడు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని, మనం పీల్చే గాలి చెట్ల నుంచి వస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకం అనర్థమని, పర్యావరణానికి ముప్పని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, బెల్లంమార్కెట్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటజగ్గారావు, సభ్యులు కర్రి శివ పాల్గొన్నారు.

### అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రధాని మోదీ కృషి

అనకాపల్లిటౌన్ : అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రధాని మోదీ పని చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల సమస్యలపై పార్టీ క్షేత్ర స్థాయిలో పని చేస్తుందని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

అనకాపల్లిటౌన్ : మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2023 కౌన్సెలింగ్ సోమవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. 1,08,001 నుంచి ఆఖరి ర్యాంక్ వరకూ కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. 104 మంది విద్యార్థులు ధృవపత్రాలను పరిశీలించి ఐసీఆర్ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు.

### మట్టి తవ్వకాలపై సమాచారం ఇవ్వండి

ఎస్.రాయవరం : చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే సహించేది లేదని యలమంచిలి డీఈ సుజాత అన్నారు. మండలంలో చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రుళ్లు మట్టి తీస్తే తమకు, పోలీస్‌శాఖకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## సుందరయ్యపేటలో త్వరలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మండలంలో సుందరయ్యపేట గ్రామంలో సోమవారం ఎంపీ సత్యవతి, విద్యాలయ డిప్యూటీ కమిషనర్ మంజునాథం పరిశీలించారు. ఈ సందర్భంగా మంజునాథం మాట్లాడుతూ భవన నిర్మాణానికి అధికారిక ఉత్తర్వులు తయారు చేసి సీపీ డబ్ల్యూ అధికారులకు అందజేయనున్నామన్నారు. అంతకుముందు పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీ సత్యవతి, మంజునాథం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, జిల్లా కో ఆర్డినేటర్ ఆదిశేషుశర్మ, ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్

నక్కపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న హెల్పర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని సీడీపీవో శ్రీవిద్య తెలిపారు. కోటవురట్ల, అరట్లకోట 1, నీలాద్రిపురం, చినగుమ్ములూరు 2, పెద బొడ్డిగల్లు, ఎస్.రాయవరం 2, వెంకటనగరం, గొడిచర్ల 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీలున్నాయన్నారు. జూలై1వ తేదీనాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ వారికి 18 ఏళ్లు నిండితే చాలన్నారు. ,పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తులు ఈ నెల 12వ తేదీలోగా ఐసీడీఎస్ నక్కపల్లి కార్యాలయంలో అందజేయాలన్నారు. స్థానికులై ఉండాలని, వివాహితులయిన సంబంధిత అర్హత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు అందజేయాలన్నారు.



## జెట్టీ నిర్మాణం కోసం స్థల పరిశీలన


రాజయ్యపేట తీరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో జయరాం

నక్కపల్లి : రాజయ్యపేటలో జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం సోమవారం పరిశీలించారు. మండలంలో మత్స్యకారుల కోసం ప్రభుత్వం ఫిష్‌ల్యాండింగ్ సెంటరు (జెట్టీ) మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ జెట్టీ నిర్మించేందుకు 10 ఎకరాల స్థలం అవసరం కానుంది. రాజయ్యపేట శివారు బోయపాడు, దొండవాక గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. రాజయ్యపేట పరిధిలో తీరంలో ఉన్న స్థలాన్ని ఆర్‌డీవో మత్స్యశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఇది అటవీశాఖకు చెందిన భూమి అని, ఈ భూమిని సేకరించి ప్రత్యామ్నాయంగా వేరొక చోట అటవీశాఖకు భూమిని బదలాయించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు ఆర్‌డీవో తెలిపారు. ఈయన వెంట మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, డిప్యూటీ తహసీల్దార్ నీరజ, సర్పంచ్ కామేసు, ఎంపీటీసీ సత్తియ్య, స్థానిక మత్స్యకారులు ఉన్నారు.